# ఎగవేతల ప్రభుత్వం కాంగ్రెస్


మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ సహకారంతో పిట్టలగుడిసెల ముదిరాజ్‌లకు సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, జూన్ 6 : కష్టాన్ని నమ్ముకున్న వారు ఏదైనా సాధిస్తారని.. యువత మద్యానికి, బెట్టింగులకు బానిసలు కాకుండా కష్టపడి జీవితంలో ఎదగాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్‌ది నిస్వార్థమైన సేవ అని, నిజాయితీ గల సేవ అని ప్రశంసించారు. శుక్రవారం నంగునూరు మండలం జేపీతండా పిట్టల గుడిసెల ముదిరాజ్‌లకు మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వంట పాత్రలు, కుర్చీలు, టేబుళ్లను ఆయన చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంత ఎదిగినా సద్ది తిన్న రేవును తలిస్తే బర్కతీ ఉంటుందని, ఎవరైనా మనకు మంచి పని చేస్తే గుర్తుంచుకుని తలుచుకోవాలన్నారు. కష్టపడాలని, కష్టపడి జీవితంలో ఎదగాలని సూచించారు. ఎంత ఎదిగితే అంత ఒదిగినపుడే మంచి జీవితాన్ని అనుభవించవచ్చని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ తనకు తోచిన సాయం చేయాలనే ఉద్దేశంతో మీ ముందుకు వచ్చారని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. ఫరూఖ్‌హుస్సేన్ నేడు కుల మతాలకు అతీతంగా సేవ కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. మళ్లీ కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ పిట్టల గుడిసెల ప్రజలకు తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్‌కు పరామర్శ

నారాయణరావుపేట, జూన్ 6 : మండలంలోని బంజేరుపల్లి మాజీ సర్పంచ్ శంకర్ తల్లి ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెంట మండల నాయకులు ఉన్నారు.


మాజీ సర్పంచ్ శంకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

# నిరుపేదలకు సేవ చేయడం అభినందనీయం


పుస్తేమట్టెలు అందజేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సంతోష్‌గుప్తా

గజ్వేల్, జూన్ 6: నిరుపేదలకు సేవ చేయడం అభినందనీయమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ నెల 13న వంటేరు ప్రతాప్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గోలి సంగోష్‌గుప్తా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహాడ్ గ్రామానికి చెందిన నిరుపేద వధువు మడూగురి శైలజకు వంటేరు ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా పుస్తేమట్టెలను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, నాయకులు గుంటుక రాజు, కనకయ్య, ఆర్‌కే శ్రీను, నంద్యానాయక్, రాములు, మల్లేశంగౌడ్, కనకయ్య, నర్సింహులు, అశోక్, భిక్షపతి పాల్గొన్నారు.

# జిల్లా దవాఖానను సందర్శించిన కాయకల్ప బృందం


గజ్వేల్‌లోని జిల్లా దవాఖానను పరిశీలిస్తున్న కాయకల్ప బృందం

గజ్వేల్, జూన్ 6: జిల్లా ప్రభుత్వ దవాఖానను శుక్రవారం కాయకల్ప బృందం సభ్యులు డాక్టర్ అమర్‌సింగ్, డాక్టర్ సాకారం, రేఖా సందర్శించి ఎక్స్‌టర్నల్ అసెస్‌మెంట్ నిర్వహించారు. దవాఖానలో వార్డులు, ఆపరేషన్ థియేటర్, లేబర్ గదులు, స్వచ్ఛత నిర్వహణ, వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర వాటిని పరిశీలించి గ్రేడింగ్ చేశారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. దవాఖానను సందర్శించిన బృందం సభ్యులు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ జయశ్రీ, ఆర్‌ఎంవో డాక్టర్ రాము పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


గజ్వేల్: రిమ్మనగూడలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

మర్కూక్,జూన్6: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ దగ్గర గ్రామ సభ నిర్వహించారు.బడిబాట అవగాహన ర్యాలీకి హాజరైన ఉపాధ్యాయులు,విద్యార్థులు,వారి తల్లిదండ్రుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు సరితాదేవి, రమణారావు, పద్మారెడ్డి,హేమలత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గజ్వేల్‌లో..

గజ్వేల్, జూన్ 6: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి బడిబాట ప్రారంభమైంది. గ్రామాల్లో పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం బడుల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా ప్రచారం చేపడుతున్నారు.

### గౌరవెల్లిలో..

అక్కన్నపేట, జూన్ 6: మండలంలోని గౌరవెల్లిలో బడిబాట నిర్వహించారు. ప్రముఖ జానపద గాయకురాలు కనుకవ్వ పాల్గొని ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతపై పాటరూపంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, శంకర్‌నాయక్, రమణబాబు, చంద్రారెడ్డి, శంకర్‌నాయక్, శ్రీనివాస్, రమాదేవి, నస్రీన్ పాల్గొన్నారు


మర్కూక్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు,విద్యార్థులు

# త్వరలోనే ఇర్కోడ్ లిఫ్ట్ ప్రారంభం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు


మహంకాళి అమ్మవారి దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


ఒగ్గు మురళి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట,జూన్ 6: మహంకాళి అమ్మవారి దయతో ఇర్కోడ్ లిఫ్ట్ నిర్మాణం చివరి దశకు వచ్చిదని.... త్వరలోనే ఇర్కోడ్ లిఫ్ట్ ప్రారంభిస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్‌లో జరిగిన మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇర్కోడ్ మహంకాళి అమ్మవారి దేవాలయం అద్భుతంగా నిర్మించారన్నారు. గ్రామ ప్రజలు, రెడ్డి సంఘం సభ్యులకు ఆయన శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. గులాబీ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో రూ. 50లక్షలు మంజూరు చేసుకొని ఆలయాన్ని అభివృద్ధి చేసుకున్నామన్నారు. ప్రతిష్ఠకోసం టీటీడీ నుంచి విగ్రహాలను తెప్పించుకున్నామన్నారు. అమ్మవారి ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం, శృంగేరి జగద్గురుస్వామి ఆశీస్సులతో జరగడం సంతోషంగా ఉందన్నారు. ఇర్కోడ్ గ్రామం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుకున్నామని, ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న

## మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

గ్రామం ఇర్కోడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు హరీశ్‌రావును సత్కరించారు.

### ఆదర్శంగా నిలిచింది పెద్దలింగారెడ్డిపల్లి

''అభివృద్ధిలో ఆదర్శంగా... అగ్రగామిగా నిలిచింది.. మూడు జాతీయ అవార్డులు అందుకున్న గ్రామం పెద్దలింగారెడ్డిపల్లి. రాష్ట్రంలో రెండు, జాతీయ స్థాయిలో ఒక అవార్డు అందుకుంది'' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లిలో మహంకాళి అమ్మవారి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహంకాళి అమ్మ జాతరలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి ఏడాది అవుతుందని.. పంచాయతీ సెక్రటరీలు అప్పుల పాలయ్యారన్నారు. రైతు బంధు బంద్ అయింది.. రెండో సీజన్లకు రైతు బంధు రానేలేదు.. పంట రుణమాఫీ సగం మందికి కాలేదు.. రైతు బీమా ఈసారి కట్టలేదన్నారు. కేసీఆర్ రైతు బాంధవుడు, రైతు కష్టం తెలిసినోడు అందుకే కాళేశ్వరం నీళ్లు తెచ్చిండు, 24 గంటలు కరెంట్ తెచ్చిండు, రైతు బంధు ఇచ్చిండన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు పెద్దలింగారెడ్డిపల్లిలో ఎకరం భూమి ధర ఎంత ఉండే, ఇప్పుడు ఎంత ఉందన్నారు. గ్రామంలో రెడ్డి సంఘం భవనాన్ని రూ.13 లక్షలతో నిర్మాణం చేశామన్నారు. మహంకాళి దేవాలయాన్ని రూ.10 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. 2లక్షల విలువ గల గ్రానైట్ అందించామన్నారు.

### బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

సిద్దిపేట కమాన్, జూన్ 6 : సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ ఒగ్గు మురళి తల్లి ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

# ఎమ్మెల్యే పల్లాకు ఘన స్వాగతం


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యే పల్లాకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


చేర్యాల, జూన్ 6 : యుఎస్‌ఏ డల్లాస్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రజతోత్సవ వేడుకలో పాల్గొనేందుకు మే 29న అమెరికా వెళ్లిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం రాత్రి స్వదేశానికి చేరుకున్నారు.ఎమ్మెల్యే పల్లా హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్టులో దిగగానే చేర్యాల ప్రాంతానికి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నాయకులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే డల్లాస్‌లో కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రజతోత్సవ వేడుకలు తదితర అంశాలను నాయకులతో పంచుకున్నారు.

# రేషన్ పంపిణీలో ప్రభుత్వాలు విఫలం


మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి అరుణ్‌కుమార్

చేర్యాల, జూన్ 6 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ బియ్యం పంపిణీ విషయంలో ఆరుసార్లు లబ్ధిదారుడి నుంచి వేలిముద్ర తీసుకోవడానికి బదులుగా ఒకేసారి వేలిముద్ర వేస్తే బియ్యం పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు.మండలంలోని పరిధిలోని శబాష్‌గూడెంలో జరిగిన సీపీఎం గ్రామశాఖ సమావేశం దాసరి కనకయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా ఒకేసారి మూడు నెలల రేషన్ ఇవ్వడం వల్ల లబ్ధిదారులు ఆరుసార్లు వేలిముద్రలు పెట్టడం వల్ల రేషన్‌కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపర్చి సరైన సౌకర్యాలు కల్పించడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు.బియ్యం కోసం ఇల్లు, పనులు వదిలి రాత్రి 9గంటల వరకు లబ్ధిదారులు షాపుల వద్ద పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రేషన్‌షాపుల వద్ద టెంట్లు, నీటి వసతి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నాగపురి కనకయ్య, గందాల బాబు, దాసరి కనకయ్య, బండకింది సంపత్, నగేశ్, ప్రకాశ్, సురేశ్, కొమురయ్య, కృష్ణ, పరమేశ్ పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి


ఎర్రవల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి

మర్కూక్,జూన్6: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని మండల తహసీల్దార్ ప్రవాణ్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంంలోని ఎర్రవల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 123 దరఖాస్తులు స్వీకరించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 325లో 440 ఎకరాల భూమి గతంలో నిరుపేదలకు కేటాయించారని, రైతుల పేరుమీద పట్టా చేసి ధ్రువపత్రాలు,పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు.

**ఐనాపూర్‌లో ..**


ఐనాపూర్‌లో తహసీల్దార్ దివ్యను ప్రశ్నిస్తున్న సీపీఎం నాయకుడు ఇస్తారి

కొమురవెల్లి, జూన్ 6 : ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు అధికార పార్టీ ప్రచార సదస్సులుగా మారాయని సీపీఎం మండల సీనియర్ నాయకుడు తేలు ఇస్తారి అన్నారు. మండలంలోని ఐనాపూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సు వల్ల ఏంఉపయోగం లేదని తహసీల్దార్ దివ్యను ఆయన ప్రశ్నించారు. రెవెన్యూ సదస్సు వేదికపై అధికారులు ఉండాల్సింది పోయి అధికార పార్టీ నాయకులను వేదికపై పిలిచి కాంగ్రెస్ సదస్సుగా మార్చారని మండిపడ్డారు. సీపీఎం నాయకులు కానుగుల రాజు, తేలు నర్సింహులు, గ్రామ రైతులు చికోటి శ్రీనివాస్, దండు రవీందర్ పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే వొడితెల పర్యటన


ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన వైష్ణవిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌టౌన్, జూన్ 6: హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పర్యటించారు. పట్టణంలోని ఆరెపల్లిలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 468 మార్కులు సాధించిన రాధారపు వైష్ణవిని అభినందించి సన్మానించారు. ఆరెపల్లిలో మిల్కూరి రవి ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడగా పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రజితావెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్, మాజీ కౌన్సిలర్లు నమిలికొండ రాజయ్య, లలిత, వేణు, రవి, హరీశ్, భాగ్యరెడ్డి ఉన్నారు.

# ప్రశ్నించే తత్వాన్ని పౌరసమాజం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న కేంద్ర సమాచార కమిషన్ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్

జగదేవ్‌పూర్, జూన్ 6: ప్రశ్నించే తత్వాన్ని పౌరసమాజం అలవర్చుకోవాలని కేంద్ర సమాచార కమిషన్ మాజీ కమిషనర్, నల్సార్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గజ్వేల్ ప్రెస్‌క్లబ్ 25 ఏండ్ల వేడుక సందర్భంగా 'జర్నలిస్టుల విలువలు–పౌరసమాజం పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏకే 47 తూపాకీ కాల్చితే చావడం లేదా చంపడం మాత్రమే జరుగుతుందని, ఒక ప్రశ్న కోట్లాది మందిని ఆలోచింపజేస్తుందన్నారు. చచ్చిపోవడానికి సిద్ధమైన వాడు సైనికుడైతే పౌర సమాజ సైనికుడు జర్నలిస్టు అన్నారు. సమాచార కమిషనర్‌గా 25వేల ప్రశ్నలకు జవాబు ఇచ్చానని, జర్నలిస్టుగా ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా వార్తలు రాశానని గుర్తు చేశారు. తెలంగాణ కోసం 75ఏండ్ల పోరాటం ఫలించడంలో తనపాత్ర కూడా ఉందని రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 3ని కేంద్ర ప్రభుత్వానికి గుర్తు చేసింది తానేనని చెప్పారు. తెలంగాణ సిద్ధించిన పేట సిద్దిపేట అని, 70 ఏండ్ల నుంచి పోరాటం చేసిన ఘనత ప్రజలదే అన్నారు. ఫస్ట్ ఎస్టేట్ రెండో ఎస్టేట్‌ను కలిపి మూడో ఎస్టేట్ ద్వారా ప్రపంచాన్ని నడుపుతున్నారని విమర్శించారు.డబ్బుతో గెలిచే ఎన్నికలు ఉన్నప్పుడు ఏఎస్టేట్ ఉండదని, ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రియల్ ఎస్టేట్ చేస్తున్నారన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో కోట్ల రూపాయల విరాళాలు తీసుకోవడానికి వీలు లేదని సుప్రీంకోర్టు విరాళాల సేకరణను తప్పుపట్టిందన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి అరుణ్, ఎంపీడీవో రాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రఘువీరారెడ్డి, మాజీ ఎంపీపీ బాలేషం, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రాసేనారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, జర్నలిస్టులు సురేందర్, మధు, యాదగిరి, దాసరి కృష్ణ, మునీర్ నర్సింహులు, పరశురామ్, పరమేశ్వర్, బాలకృష్ణారెడ్డి, శ్రీకాంత్, చిన్ని కృష్ణ, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు మహోత్సవం షురూ..


హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్టాళ్లు

హుస్నాబాద్‌రూరల్, జూన్ 6: హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ప్రారంభమైన రైతు మహోత్సవం ఆదివారం వరకు జరుగనున్నది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 150కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఆయిల్‌పామ్, ఉద్యానవన, పట్టు పరిశ్రమకు సంబంధించిన స్టాళ్లతో పాటు ఆధునిక సాంకేతికతో కూడిన వ్యవసాయ యంత్ర పరికరాలు, సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్‌లో కొత్తగా వచ్చిన స్ప్రింక్లర్లు, పండ్లరకాలు, నూతన వంగడాలు, చీడ పీడల నుంచి పంటలను రక్షించే క్రిమిసంహారక మందులతో పాటు చేప పిల్లల ఉత్పత్తి, పాడి పరిశ్రమకు సంబంధించి అనేక రకాల పశువుల జాతులు, మేకలు, గొర్రెలు, కృత్రిమ





గర్భధారణ తదితరాలు ఈ ప్రదర్శనలో ఉంచారు. మహోత్సవానికి వచ్చిన రైతులు స్టాళ్లను సందర్శించి వ్యవసాయంలో వారికి ఉన్న సందేహాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

# అక్రమంగా ఇసుక రవాణా


ఇసుక తరలించడంతో ఏర్పడ్డ గొయ్యి

చేర్యాల, జూన్ 6 : చేర్యాల ప్రాంతంలోని వివిధ వాగుల నుంచి రాత్రికి రాత్రే ఇసుకను మాయం చేస్తున్నారు.ఇసుకను అక్రమంగా రవాణా చేసే కొందరు వ్యక్తులు అర్ధరాత్రి దాటిన అనంతరం ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను సమీపంలో ఉన్న పట్టణాలు, మండల కేంద్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.మరికొందరు ఇసుక రవాణాదారులు ఇసుకను ఒకచోట డంపు చేసి రేటు రాగానే రాత్రికిరాత్రి గుట్టుచప్పుడు కాకుండా బేరం కుదుర్చుకున్న ప్రదేశానికి ఇసుకను చేర్చి కాసులు సంపాదిస్తున్నారు.మండలంలోని ఆకునూరు శివారులో ఉన్న రుద్రాయపల్లి వాగు నుంచి కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.వరికోతలు ముగియగానే పొలాల మార్గం నుంచి నేరుగా రుద్రాయపల్లి వాగుకు చేరుకుని నీల లాలయ్య, నీల కనకయ్య రైతుల పొలాల పక్కనే ఉన్న వాగు నుంచి పదుల సంఖ్యలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.కొన్ని రోజులుగా ఇసుక రవాణా తంతు కొనసాగుతుండడంతో సమీపంలో ఉన్న రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ఇసుకను మాయం చేస్తే రానున్న రోజుల్లో తమ బోరు బావుల నుంచి నీటి చుక్క రాదని సంబంధిత శాఖ అధికారులు ఇసుక రవాణాను అడ్డుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## దరఖాస్తు చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 6: మద్దూరులోని ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ ముత్యాల చక్రధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, అడ్మిషన్ కోసం ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌కాపీలతో పాటు పాఠశాల బొనాఫైడ్, మూడు పాస్‌ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## వెంకటనరసయ్యకు అభినందనలు



సిద్దిపేట కమాన్, జూన్ 6 : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవిని జిల్లా క్రీడల యువజన అధికారి జంగపల్లి వెంకటనరసయ్య శుక్రవారం హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా డీవైఎస్‌వోగా నియమితులైన వెంకటనరసయ్యను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని క్రీడారంగ స్థితిగతులు, క్రీడా మౌలిక సదుపాయాలు, వాలీబాల్ అకాడమీ,వేసవి క్రీడల శిక్షణ శిబిరాల గురించి ఆయన వివరించారు.

## గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

సిద్దిపేట టౌన్,జూన్ 6 :అరుణాచలగిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది.ఈ నెల11న పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచల పుణ్యక్షేత్రంలో జరిగే గిరి ప్రదక్షిణకు సిద్దిపేట ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడుపాలని సంకల్పించామని సిద్దిపేట డిపో మేనేజర్ రఘు శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఈ నెల 9 సాయంత్రం నాలుగు గంటలకు సిద్దిపేట నుంచి బస్సు బయలుదేరి 10న ఆంధ్రప్రదేశ్ కాణిపాకం విఘ్నేశ్వరస్వామి దర్శనం, వేలూరుమహాలక్ష్మి అమ్మవారి దర్శనం పూర్తి చేసుకొని 11న అరుణాచల గిరి ప్రదక్షిణ చేసుకొని, 12 తిరుగు ప్రయాణంలో జోగులాంబ అమ్మవారిని దర్శించుకొని 13న సిద్దిపేటకు చేరుకుంటారని తెలిపారు.

## ఎల్లమ్మ ఆలయంలో పూజలు



హుస్నాబాద్‌టౌన్, జూన్ 6: హుస్నాబాద్ రేణుకాఎల్లమ్మను మహాత్మాజ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యాసంస్థ సహాయకార్యదర్శి గాజుల శ్యామ్‌ప్రసాద్‌లాల్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్యామ్‌ప్రసాద్‌లాల్ దంపతులను ఆలయ ఈవో కిషన్‌రావు సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భగవాన్, రాజిరెడ్డి, పచ్చిమట్ల రాధ పాల్గొన్నారు.

## గాలివాన బీభత్సం



వర్గల్,జూన్ 6: మండలంలోని జెబ్బాపూర్‌లో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. గ్రామానికి చెందిన చెల్లి మల్లేశం నివాసం ఉంటున్న రేకులపాక మొత్తం కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న బియ్యం,నిత్యావసర వస్తువులు, బట్టలు పూర్తిగా చెల్లాచెదురయ్యాయి.గాలివానకు దెబ్బతిన్న ఇల్లును చూసి మల్లేశం, అతడి భార్య మంజుల, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.గ్రామస్తులుకూలిన ఇంటివద్దకు వెళ్లి బాధితులను ఓదార్చారు.

## నేటి నుంచి దుర్గమ్మ పండుగ

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 6: మద్దూరు మండలంలోని మర్మాములలో శనివారం నుంచి దుర్గమ్మ తల్లి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నేడు దుర్గమ్మకు బోనాలు, 8న మొక్కులు సమర్పించుట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

IN THE COURT OF THE
PRINCIPAL SENIOR CIVIL JUDGE
AT SIDDIPET
I.A. No. 533 OF 2023
IN
O.S. No. 123 OF 2017
Between:
Gulam Dassthagir (Died) & Others
...Petitioners/Plaintiffs
And
1) Ghouse Mohiuddin (Died)
2) Gulam Mohiuddin
... Respondents/Defendants
And
1) Shyvar Bano, W/o. Fazlur Rahman
2) Shaheen Bano, W/o. Asad Mohiuddin,
3) Nazima Bano, W/o. Hafeez Abdulla
4) Nilofer Bano, W/o. Syed Mustaq Ahmed
5) Arshiya Bano, W/o. Syed Meraj Ahmed
All are R/o. Bharathnagar,
Siddipet Town & District.
... Respondents/Prop.Defs.No. 3 to 7
Whereas in the above mentioned suit the petitioners/plaintiffs have filed a petition above mentioned in I.A. No. 533 of 2023 against you the respondents/proposed defendants No. 3 to 7 being you are the daughters of Late Ghouse Mohiuddin. The respondents/proposed defendants No. 3 to 7 are hereby directed to appear before this Hon'ble court on 17-6-2025 at 10-30 A.M. either in person or through Advocate without fail. Otherwise the matter will be decided in your absence.
(By Order of the Court)
Sd/- S. Tirupathi Reddy
Mohd. Kamaluddin
Counsel for the Petitioners/Plaintiffs